క్లుప్తంగా

ఆలయానికి రూ.33వేల ఆదాయం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద వ్యాపారాలు నిర్వహించుకునేందుకు బుధవారం ఆలయ బేడా మండపంలో బహిరంగ వేలం నిర్వహించారు. జనవరి ఆరు నుంచి 15వతేదీ వరకు ఆలయం వద్ద అమ్మవారి దీక్షా మాల ధారణకు సంబంధించి వస్త్రాలు, మాలల విక్రయించేందుకు మూడు తాత్కాలిక దుకాణాల ర్పాటు హక్కులను వేలం వేయగా రూ.23,500 ఆదాయ వచ్చినట్లు ఈఓ కె. రమేష్‌నాయుడు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సూచించిన ప్రదేశంలో జనవరి 10 నుంచి మార్చి 31వతేదీ వరకు గాలితో నింపిన జారుడు బల్ల ఏర్పాటు హక్కుల ద్వారా రూ.9,400 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

నందిగామ: ల్యాండ్ టైటిల్ యాక్ట్ 27/2023ను రద్దు చేయాలని కోరుతూ నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు విధులు బహిష్కరించి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. నిరసన అనంతరం ఆర్డీవో పి.సాయిబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన



గండేపల్లి(కంచికచర్ల) : మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాడ్, కంట్రోల్ యూనిట్ పనితీరు, ఓటువేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. సర్పంచి బొక్కా రవికుమార్, ఉపసర్పంచి బి.సుబ్బారావు, నాయకులు మట్టా చంద్రశేఖరరెడ్డి, వీఆర్వో రామారావు, పోలీస్ సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



నందిగామ: స్థానిక రామలింగేశ్వరనగర్‌లోని సాయి అయ్యప్ప ఆలయంలో బుధవారం రాత్రి అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. 18మెట్ల ఏకశిలపై కేరళ సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన పడిపూజ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు హాజరై పూజలు చేశారు.

ఎన్‌ఎస్‌ఎం స్కూల్ స్వర్ణోత్సవాలు ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని ఎన్‌ఎస్‌ఎం స్కూల్ స్వర్ణోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు పాఠశాల ప్రైమరీ విభాగం స్వర్ణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ ప్రావెన్స్ ప్రావెన్షియల్ సుపీరియర్ షైన్ అలెక్స్, పాఠశాల పూర్వ విద్యార్థి, అమెరికాకు చెందిన టీఏవో డిజిటల్ సొల్యూషన్స్ అధినేత వెలగపూడి రాజ్‌కుమార్, పీవీపీ వెంచర్స్ ఎండీ పొట్లూరి వరప్రసాద్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పొట్లూరి వరప్రసాద్(పీవీపీ) మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని చెప్పారు.బ్రదర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాలతో పారదర్శక పాలన



రామన్నపేటలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పారదర్శక పాలన సాగిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని రామన్నపేట గ్రామంలో రూ.40లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా 500లకు పైగా ప్రభుత్వ సేవలను గ్రామాల్లోనే అందిస్తుండటం దేశచరిత్రలో ఓ రికార్డు అని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్ల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గతంలో మాదిరి ఆయా పనుల కోసం మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన పని లేకుండా, అన్నిరకాల అనుమతులతోపాటు సర్టిఫికెట్ల జారీ కూడా సచివాలయం ద్వారానే జరుగుతుండటం ప్రజలకు ఎంతో మేలుగా ఉందని వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారని గుర్తుచేశారు. సీఎం జగనన్న ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతిఒక్క హామీని అమలుచేసి చెప్పాడంటే చేస్తాడంతే అనేంతగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరీ, జడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, ఉప సర్పంచ్ తిరుపతిరావు, చెన్నవరపు కల్పన, నాయకులు సుబ్బయ్య, ఆలప్రభు, సురేష్, బుగ్గినేని సురేష్, రాయల జానకి రామయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు రాయితీలు



మాట్లాడుతున్న ఎంఎస్‌ఎంఈ డీఎఫ్‌వో మూర్తి

పెనుగంచిప్రోలు: పరిశ్రమలు స్థాపించేవారికి ప్రభుత్వాలు ఎంతో అండగా ఉంటూ వారికి ఎన్నో రాయితీలు కల్పిస్తున్నాయని ఎంఎస్‌ఎంఈ(మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్) డెవలప్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, విశాఖపట్నంకు చెందిన ఎంఎస్ఎమ్ఈ డీఎఫ్‌వో డీవీఎస్‌ఆర్ మూర్తి తెలిపారు. స్థానిక మునేరు అవతల జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎంఎస్ఎం, ఐపీఆర్ ఇంటలెక్చువల్ స్టార్ట్ అప్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను వివరించారు. పరిశ్రమలు స్థాపనకు ఏమి చేయాలి, ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి, ఏయే పరిశ్రమలు ఎలా ఏర్పాటు చేసుకోవాలనే అంశాలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించే వసతులు, రాయితీలను అందిపుచ్చుకుని పారిశ్రామిక సంస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కెఎల్ ఇంటర్నేషనల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ సీనియర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గిరిధర్, విశ్వబ్రాహ్మణ సంఘ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ, ఆకునూరి గ్రూఫ్ ఆఫ్ కంపెనీ డైరెక్టర్ ఎ.వీరారెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘ మండల కార్యదర్శి తునికిపాటి శివ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీపీ గాంధీ, అధికారులు

పెనుగంచిప్రోలు: ఆడుదాం..ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, కార్యాలయ ఏవో కె.సిద్ధారెడ్డి, సూపరింటెండెంట్ భానుప్రసాద్, పీఈటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు 2,280 మంది క్రీడాకారులు, క్రీడలను వీక్షించేందుకు 3,427 మంది ప్రేక్షకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు. లో క్రికెట్ ఆడేందుకు 971 మంది క్రీడాకారులు, బ్యాడ్మింటన్‌కి 308, వాలీబాల్‌కి 258, కబడ్డీకి 716, ఖోఖో పోటీలకు 464మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. క్రీడల నిర్వహణకు మండలంలో ఐదు మైదానాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ కోరారు.

కల్యాణ మండపానికి భూమిపూజ



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, కమిటీ సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం(పెద్ద శివాలయం) వద్ద నూతనంగా నిర్మించనున్న కల్యాణ మండపానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ బుధవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా సామినేని వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కల్యాణ మండపం నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కృషితో రూ.40లక్షల సీజీఎఫ్ నిధులు మంజూరైనట్లు చెప్పారు. రూ.20లక్షల మేర దాతల సహకారంతో కల్యాణమండపం నిర్మాణాన్ని పూర్తిచేస్తామని వివరించారు. నియోజకవర్గంలో 15 దేవాలయాలకు గాను రూ.1 కోటి 70లక్షలు మంజూరుకాగా, ఆయా ఆలయాల్లో పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు గెల్లా పూర్ణచంద్రరావు, సంగిశెట్టి శ్రీరంగమ్మ, పల్లపోతుల గీతా విశాలాక్షి, కర్నాటి శ్రీనివాసరావు, మాడపాటి కిషోర్, బాలస్వామి, ఈవో జయప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో మహిళల భాగస్వామం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: పట్టణంలోని 16వవార్డులో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల అమలు తేదీల క్యాలెండర్‌ను వార్డుప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఒక దీపం ఇంటికి వెలుగునిస్తే, చదువు అనే దీపం కుటుంబ రూపురేఖలనే మారుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క సంక్షేమ పథకంలో మహిళలను భాగస్వాములను చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. విద్య, వైద్యానికి సీఎం జగనన్న అధిక ప్రాధాన్యతనిస్తున్నారని వివరించారు. ముఖ్యంగా నిరుపేద విద్యార్థులు సైతం జాతీయ స్థాయిలో రాణించేలా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. అంతే కాకుండా కార్పొరేట్ పాఠశాలలకు మాత్రమే సొంతమైన ఇంగ్లీష్ మీడియం చదువులను ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్నే అని చెప్పారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించటమే కాకుండా పథకాల అమలులో సైతం ఎటువంటి అవకతవకలకు, అవినీతికి తావు లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వార్డు కన్వీనర్ అచ్చి చిన్నబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, నాయకులు ఓర్సు జ్వాలా, షేక్ ఫాతిమా, నాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన పేట గురుకుల విద్యార్థులు



జగ్గయ్యపేట అర్బన్: అహ్మదాబాద్‌లో స్టెంపీడియా సంస్థ నిర్వహించిన దివాలీ ఇన్నోవేషన్ జాతీయ పోటీల్లో జగ్గయ్యపేటకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని సాధించినట్లు గురుకులం ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసుజాత తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో ప్రతిభచూపి ప్రథమబహుమతిని సాధించిన పదోతరగతి విద్యార్థులు బి.కీర్తన, యు.రమాదేవిలను బుధవారం అభినందించారు. కార్యక్రమంలో గురుకులం ఏటీఎల్ ఇన్‌చార్జ్ కె.శ్రీదేవి, మెంటర్ కె.రాజీవ్, విద్యార్థులు పాల్గొని విజేతలను అభినందించారు.

ఉద్యోగుల సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యం

విప్ ఉదయభాను



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ఆర్టీసీ సంస్థను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఉద్యోగుల దీర్ఘకాలిక ఆకాంక్షను నెరవేర్చి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కొనియాడారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో సెంటర్ వద్ద సామినేని విశ్వనాథం కార్మికనగర్‌లో పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ఉదయభాను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనాన్ని ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. సీఎం జగనన్న ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసి లక్షలాది మంది ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు. కరోనా కష్టకాలంలో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగులకు అండగా ఉన్నారని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో జగనన్నకు అందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు చల్లా చంద్రయ్య, ప్రసాద్‌రాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన

లింగగూడెం(పెనుగంచిప్రోలు): మండలంలోని లింగగూడెంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి విశ్వకర్మ తదితర పథకాల గురించి ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి సుజన ఆధ్వర్యంలో ఆరోగ్యశిబిరం నిర్వహించి, గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు. ఎంపీటీసీ సభ్యులు బరిగెల వెంకట్రామయ్య, ఉపసర్పంచి బి.వెంకటరెడ్డి, నాయకులు ఏనుగుల ధర్మారెడ్డి, బీజేపీ నాయకులు కల్లూరి శ్రీవాణి, మన్నె శ్రీనివాసరావు, అప్పారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటకు పచ్చందాలు



కడియంలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణాన్ని పచ్చని చెట్లతో సందరవనంలా రూపుదిద్దేందుకు రూ.20లక్షలతో ప్రత్యేక ప్రణాళికలను రూపొందించినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. రాజమండ్రి సమీపంలోని కడియంలో ఉన్న నర్సరీని బుధవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లతో కలిసి ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఒక్కటే ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. రానున్న పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు చెప్పారు. జగ్గయ్యపేటను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందుబాటులో ఉంచే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కడియం నర్సరీలో ఎంపిక చేసిన వివిధ రకాల మొక్కలను త్వరలో జగ్గయ్యపేటకు తెప్పించి నాటుతామని వివరించారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్ కాశి కిషోర్, కంట్రాక్టర్ వాసు, డీఈఈ శివకోటేశ్వరరావు ఉన్నారు.

జగనన్న కాలనీల్లో పనుల పరిశీలన



కంపచెట్ల తొలగింపు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ మలక్‌బషీర్

పెండ్యాల(కంచికచర్ల) : జగనన్న కాలనీల్లో ప్రజలకు అన్నివసతులు కల్పిస్తున్నామని, ఇళ్లు మంజూరైన వారు త్వరితగతిన పనులు పూర్తిచేసుకోవాలని ఎంపీపీ షేక్ మలక్ బషీర్ సూచించారు. పెండ్యాల జగనన్న కాలనీలో లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులు, కాలనీలో కంపచెట్ల తొలగింపు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పెండ్యాలలో 610 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతోపాటు ఇళ్లు కూడా మంజూరు చేసినట్లు చెప్పారు. ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసుకునేవారికి ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తోందని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టినవారికి ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా అయ్యేలా చూడాలని అధికారులను కోరారు.

శాస్త్రీయ విద్యావిధానం అమలుచేయాలి

జగ్గయ్యపేట అర్బన్: దేశంలో, రాష్ట్రంలో శాస్త్రీయ విద్యావిధానం అమలు చేయాలని ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్ కోరారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ మహాసభ బుధవారం స్థానిక ఉక్కు కళావేదికలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అధ్యక్షతన జరిగింది. ముందుగా సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని, కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వం అందరికీ ఉచిత విద్య అందించాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర మాట్లాడుతూ కళాశాలల్లో ర్యాగింగ్‌ను అరికట్టాలని, ప్రైవేటు రంగంలో కూడా ఉద్యోగ, ఉపాధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కన్నాల శివారెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజీ శివాజీ, పేట పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అమర జవాన్ల కుమార్తెలకు ల్యాప్‌టాప్‌ల వితరణ

విజయవాడస్పోర్ట్స్: యుద్ధంలో అమరులైన జవాన్ల కుమార్తెలకు అధర్వ ఫౌండేషన్ సభ్యులు ప్రొఫెసర్ సందీప్ గొండే, ప్రొఫెసర్ బాలాజీ షిండే ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. అధర్వ ఎడ్యుకేషన్ ట్రస్ట్, అధర్వ ఫౌండేషన్ చైర్మన్, బోరవాలి(ముంబై) ఎమ్మెల్యే సునీల్ రాణే సమకూర్చిన ల్యాప్‌టాప్‌లను విజయవాడలోని సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో వారు బుధవారం అందజేశారు. యుద్ధంలో అమరులైన ఐదుగురు జవాన్ల కుమార్తెలకు ఒక్కొక్కరికి ఒక్కో ల్యాప్‌టాప్‌ను అందజేయడం పట్ల బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఫౌండేషన్ దేశభక్తి, స్ఫూర్తిని కొనియాడారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు

పెద్దాపురం(వీరులపాడు):వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్ఐ మహాలక్ష్మణుడు సూచించారు. మండలంలోని పెద్దాపురం సమీపంలో బుధవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనచోదకులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండటంతోపాటు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. వేగంగా వాహనాలను నడిపి ప్రమాదాల బారినపడవద్దని వాహనదారులకు సూచించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.